# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

VC NEWS

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

నిజామాబాద్ శుక్రవారం 27 జూన్ 2025

వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి: 02 సంచిక: 335

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




భాగ్యనగరిలో ప్రారంభమైన ఉత్సవాలు

గోల్కొండ కోటలో బోనాల సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మంత్రి పొన్నం ప్రభాకర్, జోగిని శ్యామల, మంత్రి కొండా సురేఖ

## జగదాంబిక అమ్మవారికి

# తొలి బోనం

హైదరాబాద్: రాజధానిలో బోనాల సందడి మొదలైంది. గురువారం గోల్కొండ కోటలోని శ్రీజగదాంబిక అమ్మవారికి బంగారు బోనం సమర్పించడంతో నెల రోజుల పండగ ప్రారంభమైంది. మహిళలు బోనాలతో వచ్చి.. మొక్కులు చెల్లించుకోగా శివసత్తుల పూనకాలు, డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలతో ఆ ప్రాంతమంతా మార్మోగింది. లంగర్‌హౌస్ చౌరస్తాలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖలు అమ్మవారి తొట్టెల, ఫలహారం బండికి పూజలు నిర్వహించారు. అక్కడే గోల్కొండ ఖిలా జగదాంబిక అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించి, కల్లు సాక పెట్టి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున స్పీకర్, మంత్రులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. సమృద్ధిగా వర్షాలు పడి, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు మంత్రులు తెలిపారు. పొన్నం ప్రభాకర్ భక్తులతోపాటు నృత్యం చేస్తూ ఉత్సాహపరిచారు. జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్, దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లంగర్‌హౌస్ చౌరస్తా నుంచి గోల్కొండ బడాబజార్‌లోని పూజారి ఇంటికి ఊరేగింపు సాగింది. పూజారి ఇంటి నుంచి అమ్మవారిని గోల్కొండ వరకు భక్తులు తోడ్కొని వెళ్లారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, భారాస ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి గోల్కొండ కోటలో అమ్మవారిని దర్శించుకున్నారు.





# డ్రగ్స్ పట్టుబడితే విద్యాసంస్థలపైనా కేసులు

2లో..



- మాదక ద్రవ్యాలు లేని సమాజం కోసం కృషి
- యువతను ఆరోగ్యంగా ఉజ్వల భవిష్యత దిశగా నడిపించాలి
- డ్రగ్ ఫ్రీ తెలంగాణ సంకల్పానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలి
- స్కూల్స్,కాలేజీల్లో డ్రగ్స్ దొరికితే యాజమాన్యాలదే బాధ్యత
- అవసరమైతే సైకాలజీ ప్రొఫెషనల్స్‌ను నియమించుకోవాలి
- మదక ద్రవ్యాలను అరికట్టే సందర్భంలో కఠిన చర్యలు తప్పవు
- డ్రగ్స్ వ్యవిరేక సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి వెల్లడి

"తెలంగాణ అంటే ఉద్యమాలు.. పోరాటాల గడ్డ. ఉద్యమాల గడ్డ డ్రగ్స్‌కు అడ్డాగా మారితే అవమానకరం. పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకు విద్యార్థులపై డ్రగ్స్ ప్రభావం పడింది. డ్రగ్స్ మహమ్మారికి బలవుతున్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైతే దేశం మనుగడకే ప్రమాదం.



2లో..

## పిల్లల వరకు చేరుతున్న డ్రగ్స్

చాక్లెట్లు, బిస్కట్ల రూపంలో సరఫరా

ఆందోళన వ్యక్తం చేసిన మంత్రి సీతక్క



2లో..

## రాజమహేంద్రి అంటేనే గోదావరి

- ఎందరో మహానుహావులకు జన్మస్థానం
- పర్యాట రంగంతో ఏటా 4లక్షల మందికి ఉపాధి
- అఖండ గోదావరికి శంకుస్థాపనలో
- డిప్యూటి సిఎం పవన్

## ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట



రూ.180 కోట్ల వైద్య బిల్లుల విడుదల

26,519 మంది ఉద్యోగులు, పింఛనుదారులకు లబ్ధి ఉద్యోగులు, ప్రభుత్వం ఒక ఆదర్శ కుటుంబమన్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

# ప్రాజెక్టుల నిర్వహణలో సర్కార్ నిర్లక్ష్యం



హైదరాబాద్: ప్రాజెక్టుల నిర్వహణ కూడా రాకపోవడం వల్లే జూరాల ప్రమాదంలో పడిందని బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ మండిపడ్డారు. జూరాల రోప్ 9వ నంబర్ గేట్ తెగిపోవడం ప్రభుత్వ నిర్లక్షానికి నిదర్శనం అని అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి ఏటా వరద వస్తుందని తెలిసినా స్పిల్ వే వద్ద మెయింటెనెన్స్ పనులు చేయలేదని, మెయింటెనెన్స్ పనులు చేయించడంలో నిర్లప్తత స్పష్టంగా కనిపిస్తోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. జూరాలకు వరద ఉధృతి దృష్ట్యా ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలని సూచించారు. జూరాల ప్రాజెక్టుకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కెటిఆర్ కోరారు. జూరాల ప్రాజెక్టులోని 9వ నంబర్ గేట్ రోప్ తెగిపోవడం కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనం అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. ఒక్క ఇటుక పేర్చడం కూడా చేతకాని ముఖ్యమంత్రికి కనీసం ఉన్న ప్రాజెక్టు నిర్వహణ కూడా రాకపోవడం వల్లే జూరాల ప్రాజెక్టు డేంజర్‌లో పడిందని ఆరోపించారు. ప్రతిఏటా వరద వస్తుందని తెలిసినా స్పిల్ వే వద్ద మెయింటెనెన్స్ పనులు చేయించడంలో రేవంత్ సర్కారు నిర్లిప్తత స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు.

జూరాలకు క్రమంగా వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి, మంత్రులు ఇప్పటికైనా మొద్దునిద్ర వీడాలని అన్నారు. ఇప్పటికే ఈ ప్రభుత్వ అసమర్థత వల్ల ఎస్.ఎల్.బి.సి టన్నెల్ కుప్పకూలి ఎనిమిది మంది నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.



# నగరంలో ఆషాడ బోనాల సందడి

## గోల్కొండలో తొలిబోనం సమర్పించిన కవిత

**హైదరాబాద్:** ఆషాఢ మాసం బోనాలు భాగ్యనగరంలో ప్రారంభమయ్యాయి. చారిత్రాత్మక గోల్కొండ కోటపై వెలిసిన జగదాంబిక ఎల్లమ్మ ఆలయంలో తొలి బోనంతో బోనాల సందడి ప్రారంభమైంది. తెలంగాణ సంస్కృతికి, అస్తిత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగ సందర్భంగా నగరంలో సందడి మొదలయ్యింది. ఈ క్రమంలో గోల్కొండ జగదాంబిక మహంకాళి, ఎల్లమ్మ తల్లికి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బోనం సమర్పించారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని అమ్మవారిని ప్రార్థించినట్లు కవిత పేర్కొన్నారు.

# 345 గుర్తింపులేని రాజకీయ పార్టీలపై అనర్హత

## ఎన్నికల సంఘం సంచలన నిర్ణయం





2లో..





# ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి అప్పగించాలి.

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్.
- 29న నిజామాబాద్ కు అమిత్ షా రాక.
- పసుపు బోర్డు ఆఫీసు ప్రారంభం.
- దివంగత మాజీ మంత్రి డీఎస్ విగ్రహావిష్కరణ.

నిజామాబాద్ పసుపుబోర్డు రైతులకు గర్వకారణం 29న బోర్డును ఆవిష్కరించనున్న హోంమంత్రి అమిత్ షా

అరవింద్ హామీ మేరకు "పసుపు బోర్డు" జిల్లాకు బహుమతి.

వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 26 : సీఎం రేవంత్ రెడ్డికి చిత్త శుద్ధి ఉంటే ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాలి అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రాకుంటే న్యాయస్థానం ద్వారా ఆదేశాలు తెచ్చుకుని సీబీఐకి కేసు ఇచ్చేలా ఒత్తిడి తెస్తాము అని అన్నారు. ఈనెల 29 న కేంద్ర హెూమ్ మంత్రి అమిత్ షా నిజామాబాద్ పర్యటన నేపథ్యంలో గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ

మిగతా 2లో



# జీరో గ్రావిటీకి అలవాటు పడుతున్నా..

## అంతరిక్షం నుంచి శుభాన్షు శుక్లా సందేశం

న్యూఢిల్లీ: భారత వ్యోమగామి, గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లా రోదసి ప్రయాణం విజయవంతంగా ప్రారంభమైంది. ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్‌లో బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు ప్రయోగించిన స్పేస్‌ఎక్స్‌కు చెందిన ఫాల్కన్-9 రాకెట్ నిప్పులు చిమ్ముతూ విజయవంతంగా రోదసిలోకి దూసుకెళ్లింది. ఈ సందర్భంగా అంతరిక్షం నుంచి శుభాన్షు ఓ సందేశం పంపారు. ఈ ప్రయాణంలో ప్రతిక్షణాన్ని ఆస్వాదిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తాను జీరో గ్రావరిరటీకి అలవాటు పడుతున్నట్లు చెప్పారు. 'అందరికీ నమస్కారం.. తోటి వ్యోమగాములతో ఇక్కడ ఉండటం చాలా సంతోషంగా ఉంది. వావ్.. ఇది ఎంత అద్భుతమైన ప్రయాణం. ఈ ప్రయాణంలో ప్రతిక్షణాన్ని నిజంగా ఆస్వాదిస్తున్నాను. ఇప్పుడిప్పుడే నడవడం నేర్చుకునే చిన్నారిలా.. జీరో గ్రావిటీకి అలవాటు పడుతున్నాను. ఎలా కదలాలో, నన్ను నేను ఎలా నియంత్రించుకోవా, ఎలా తినాలో తెలుసుకుంటున్నా' అంటూ శుభాన్షు ఈ ప్రయాణంలో తన అనుభవాలను సందేశం ద్వారా పంచుకున్నారు. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోకి వ్యోమగాములను పంపించి అక్కడ పలు ప్రయోగాలు చేయించడానికి అమెరికాకు చెందిన వాణిజ్య అంతరిక్ష సంస్థ 'యాక్సియం స్పేస్'.. నాసా, స్పేస్‌ఎక్స్, ఇస్రో, ఐరోపా అంతరిక్ష సంస్థ ఈఎస్ఏ భాగస్వామ్యంతో ఈ ప్రయోగాన్ని చేపట్టింది. దీర్ఘకాలంపాటు చేపట్టే రోదసి యాత్రల్లో వ్యోమగాముల శారీరక మార్పులపై ప్రధానంగా ఈ మిషన్‌లో రిసెర్చ్ చేయనున్నారు. రోదసి యాత్రల సమయంలో కండరాలు, గుండె, రక్తనాళాలు, రోగనిరోధక వ్యవస్థపై కలిగే ప్రభావం.. ఇలా 60కి పైగా శాస్త్రీయ ప్రయోగాలను చేయనున్నారు. యాక్సియం-4 మిషన్‌లో భాగంగా ఈ ప్రయోగాన్ని చేపట్టారు. ఈ ప్రయోగానికి భారత వ్యోమగామి శుభాన్షు పైలట్‌గా వ్యవహరిస్తున్నారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# డ్రగ్స్ పట్టుబడితే విద్యాసంస్థలపైనా కేసులు



హైదరాబాద్:స్కూల్స్, కాలేజీల్లో మాదక ద్రవ్యాలు దొరికితే అది టీచర్లదే బాధ్యత అని.. పర్యవేక్షించాల్సిన బాధ్యత యాజమాన్యాలదేనని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. విద్యాసంస్థల్లో డ్రగ్స్ దొరికితే యాజమాన్యాలపై కూడా కేసులు పెట్టండని ఆదేశిస్తున్నానని సీఎం రేవంత్ అన్నారు. ఫీజులు తీసుకుంటాం.. బాధ్యత తీసుకోం అంటే కుదరదని హెచ్చరించారు. బిహేవియరల్ ఛేంజెస్ గురించి చెప్పే సైకాలజీ ప్రొఫెషనల్స్ ను నియమించుకోవాలని విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. పిల్లల వ్యవహార శైలిలో మార్పును గమనించాల్సిన బాధ్యత టీచర్లది, యాజమాన్యాలదేనని అన్నారు.

శిల్పకళా వేదికలో యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ యాంటీ డ్రగ్ , ఇల్లీగల్ ట్రాఫికింగ్ డే అవగాహన కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. డ్రగ్స్, గంజాయి గురించి టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇస్తే.. కట్టడి చేస్తామని అన్నారు. స్కూల్స్, కాలేజీల్లో కూడా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్కూల్స్, కాలేజీల ముందు గంజాయి చాక్లెట్స్ అమ్మినట్లు తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. హైదరాబాద్ టార్గెట్ న్యూయార్క్ అని.. బెంగళూర్, ముంబై, ఢిల్లీ కాదని అన్నారు. తెలంగాణలో 68 శాతం జనాభా యువత అని.. యువతకు స్కిల్స్ పెంపొందిం చేందుకు శిక్షణ ఇస్తే న్యూయార్క్ తో పోటీ పడగలమని అన్నారు. మాదక ద్రవ్య రహిత సురక్షితమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. యువతను ఆరోగ్యకరమైన ఉజ్వల భవిష్యత్తు వైపు నడిపించడమే లక్ష్యంగా కలిసి పని చేద్దామని 'కోరారు. డ్రగ్ ఫ్రీ తెలంగాణ సంకల్పానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ఐటీ, ఫార్మా హబ్‌గా ఉన్న తెలంగాణ.. గంజాయి, డ్రగ్స్ హబ్‌గా మారితే మనందరం విఫలమైనట్టేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ గడ్డపై గంజాయి, డ్రగ్స్ వైపు చూస్తే వారి వెన్ను విరుస్తామని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే స్పష్టంగా చెప్పానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 'తెలంగాణ అంటే ఉద్యమాలు.. పోరాటాల గడ్డ. ఉద్యమాల గడ్డ డ్రగ్స్‌కు అడ్డాగా మారితే అవమానకరం. పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకు విద్యార్థులపై డ్రగ్స్ ప్రభావం పడింది. డ్రగ్స్ మహమ్మారికి బలవుతున్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైతే దేశం మనుగడకే ప్రమాదం. ఒక దేశాన్ని దెబ్బతీయడానికి శత్రుదేశాలు ఏ మార్గాన్ని ఎంచుకుంటాయో చెప్పలేం. కొన్ని దేశాలు కొవిడ్‌ను ఎంచుకోవచ్చు.. మరికొన్ని దేశాలు డ్రగ్స్‌ను ఎంచుకోవచ్చు. మదక ద్రవ్యాలు తరలించే వారు తెలంగాణ సరహహద్దులో అడుగు పెట్టాలంటే ఒకటికి వందసార్లు ఆలోచించుకునేలా చర్యలు ఉండాలని మంత్రివర్గ సహచరులు, పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చానని అన్నారు. యుద్ధం, సైనికులు అంటేనే.. పంజాబ్ గుర్తుకు వచ్చేది. అలాంటి పంజాబ్ ఇవాళ డ్రగ్స్ మహమ్మారి వలలో చిక్కుకుంది. డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలి యువతను సరైన మార్గంలో పెట్టాలి, అభివృద్ధి పథంవైపు నడిపించాలని స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చాం. 140 కోట్ల జనాభా ఉన్న దేశానికి ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణపతకం రాకపోవటం గురించి ఆలోచించాం. యువతకు సాంకేతిక నైపుణ్యం అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. డ్రగ్స్ నిర్మూలన బాధ్యత పౌరులపై కూడా ఉంది. పిల్లల ప్రవర్తనను గమనించేందుకు ప్రత్యేకమైన సిబ్బందిని నియమించుకోవాలి. స్జబెక్ట్, పీఈటీలను నియమించుకున్నట్టే బిహేవియర్ అబ్జర్వర్స్‌ను నియమించుకోవాలన్నారు. డ్రగ్స్ నివారణకు ప్రత్యేకంగా 'ఈగల్' అనే విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి పంట, సరఫరా, విక్రయంపై ఈగల్ టీమ్ ప్రత్యేక నిఘా పెడుతుంది' అని సీఎం తెలిపారు. సినీనటులు రామ్‌చరణ్, విజయ్‌దేవరకొండకు ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా.. యువతకు మంచి సందేశం ఇవ్వాలని, ఈ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు' అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్‌రాజు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కోచ్ పుల్లెల గోపీచంద్, పలువురు ఉన్నతాధికారులు...తదితరులు పాల్గొన్నారు.

# పిల్లల వరకు చేరుతున్న డ్రగ్స్



ములుగు:తెలంగాణలో డ్రగ్స్ వ్యసనం రోజురోజుకూ పెరిగిపోతున్న నేపథ్యంలో, నేషనల్ ఆంటీ డ్రగ్స్ డే సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని జిల్లా పోలీస్ శాఖ చేపట్టింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సీతక్క కీలక వ్యాఖ్యలు చేశారు. డ్రగ్స్ అనే వ్యాధి యువతను భయంకరంగా పీడిస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. 'ఇది ఒకప్పుడు విదేశాల్లో మాత్రమే వినిపించే సమస్య. ఇప్పుడు మాత్రం స్కూళ్ల దాకా ప్రవేశించింది. చాక్లెట్లు, బిస్కెట్లు రూపంలో పిల్లలకు చేరుతోంది. ఇది అత్యంత భయంకరమైన పరిస్థితి,' అని సీతక్క అన్నారు. డ్రగ్స్‌ను వ్యాపారంగా మార్చిన కొంతమంది, లాభాల కోసం సమాజాన్ని మత్తులోకి లాగుతున్నారన్నారు. డ్రగ్స్‌కు బానిసలైన విద్యార్థులు, యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటూ తల్లిదండ్రులకు బాధను మిగులుస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'ఇలాంటి వారిని సొసైటీ కూడా తిరస్కరించే అవకాశం ఉంది. ఇది కేవలం వారి జీవితమే కాదు ? సమాజానికే ప్రమాదం' అని పేర్కొన్నారు. మత్తు పదార్థాల వాడకం మూలంగా చిన్నారులపై అత్యాచారాలు, వృద్ధులు ఆడపిల్లలపై రేపులు, హత్యలు వంటి దారుణాలు జరుగుతున్నాయని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. 'ఇది నేరం మాత్రమే కాదు, మానవత్వాన్ని మరిచే స్థితి,' అని అన్నారు.

ప్రభుత్వం డ్రగ్స్ నిర్మూలనకు కట్టుబడి ఉన్నదని పేర్కొంటూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా మార్చాలనే లక్ష్యంతో కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. 'ప్రతి ఒక్కరూ బాధ్యతగా మత్తుపదార్థాలను తిరస్కరించి, డ్రగ్స్ నిర్మూలన కోసం కృషి చేయాలి' అంటూ ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె పోలీస్ శాఖకు, కార్యక్రమ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. డ్రగ్స్ వంటి ముప్పుల నుంచి సమాజాన్ని రక్షించాలంటే, ప్రభుత్వం మాత్రమే కాదు, ప్రతి పౌరుడి భాగస్వామ్యం అవసరమని అన్నారు.

## పార్లమెంట్ ఎప్పటికీ సుప్రీం కాదు



ముంబై: భారత్‌లో రాజ్యాంగమే అత్యున్నతమైందని.. ప్రజాస్వామ్యంలోని మూడు విభాగాలు దాని కిందే పనిచేస్తాయని సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ వ్యాఖ్యానించారు. అందరూ అనుకుంటున్నట్లు లేదా భావిస్తున్నట్లు పార్లమెంట్ సుప్రీం కాదన్నారు. ప్రజాస్వామ్యం ఛత్రం కింద
పార్లమెంట్ ఒకటని అభిప్రాయపడ్డారు. బేసిక్ స్ట్రక్చర్ డాక్ట్రిన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉద్దేశించి మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగాన్ని సవరించేందుకు పార్లమెంట్‌కు అధికారాలు ఉన్నాయి. కానీ, రాజ్యాంగం ప్రాథమిక రూపాన్ని మాత్రం అది మార్చలేదన్నారు. భారత 52వ సీజేఐగా గవాయ్ గత నెల బాధ్యతలు స్వీకరించారు. తూర్పు మహారాష్ట్రలోని అమరావతిలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. శాసన, న్యాయ, కార్యనిర్వాహక విభాగాల్లో ఏది అత్యున్నతమైందని తరచూ చర్చ తలెత్తుతోందని గవాయ్ అభిప్రాయపడ్డారు. ' చాలామంది పార్లమెంట్ అత్యున్నతమైందని అంటారు. కానీ, నా ఉద్దేశంలో భారత రాజ్యాంగమే అత్యంత ముఖ్యమైంది. ప్రజాస్వామ్యంలోని మిగిలిన మూడు విభాగాలు దానికిందే పనిచేస్తాయి. మనం విధులు నిర్వహిస్తున్నామని న్యాయమూర్తులు ఎల్లవేళలా గుర్తుంచుకోవాలి. మనం ప్రజల హక్కులకు, రాజ్యాంగ విలువలు, నిబంధనలకు రక్షకులం. కేవలం మనకు అధికారం మాత్రమే లేదు. బాధ్యతలు కూడా ఉన్నాయి. తీర్పుల గురించి ప్రజలు ఏమనుకొంటున్నారు అన్నది జడ్జీలను ప్రభావితం చేయకూడదు. మనం స్వతంత్రంగా ఆలోచించాలి' అని పేర్కొన్నారు. తాను రాజ్యాంగం ప్రసాదించిన హక్కులకు అండగా నిలుస్తానన్నారు.

బుల్డోజర్ న్యాయంపై తాను ఇచ్చిన తీర్పు మీద ఆయన స్పందించారు. ప్రతిఒక్కరికీ నివసించేందుకు ఇల్లు ఉండాలన్నారు. చిన్నప్పుడు తాను ఆర్కిటెక్ట్ కావాలనుకొన్నట్లు చెప్పారు. కానీ, తాను లా చదవడం
తన తండ్రి కోరిక అని పేర్కొన్నారు.

## 345 గుర్తింపులేని రాజకీయ పార్టీలపై అనర్హత



న్యూఢిల్లీ: రాజకీయ పార్టీగా నమోదై ఎన్నికల్లో పోటీ చేయని రాజకీయ పార్టీలపై ఎన్నికల సంఘం కొరడా ఝుళిపించింది. 2019 నుంచి ఇప్పటి వరకు గడిచిన ఆరేళ్లలో ఒక్క ఎన్నికల్లోనూ పోటీ చేయని 345 గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలను గుర్తించి వాటిని డీలిస్ట్ చేసే ప్రక్రియను ప్రారంభించింది. ఆయా పార్టీల కార్యాలయాలు కూడా ఎక్కడా లేవని ఈసీ గుర్తించి ఈ నిర్ణయం తీసుకుంది. ఈ జాబితాలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన పార్టీలు ఉన్నాయని ఈసీ పేర్కొంది. ఎన్నికల సంఘం వద్ద సుమారు 2800కి పైగా గుర్తింపులేని నమోదిత రాజకీయ పార్టీలు ఉన్నాయి. సాధారణంగా ఒక పార్టీ గుర్తింపు పొందాలంటే సాధారణ ఎన్నికల్లో కనీసం 6? ఓట్లను లేదా నిర్దిష్ట సంఖ్యలో సీట్లను గెలుచుకోవాలి. మిగిలిన పార్టీలను నమోదిత గుర్తింపులేని పార్టీలుగానే పరిగణిస్తారు.

## మద్యం మాఫియాను పెంచి పోషించారు

విజయవాడ:ప్రజా సమస్యలపై మాట్లాడే నైతిక హక్కు జగన్‌కి లేదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. ఐదేళ్లు అధికారంలో ఉండి మద్యం మాఫియా నడిపించారని ఆరోపించారు. రైతులను నట్టేట ముంచారని ఫైర్ అయ్యారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.గురువారం విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల మీడియాతో మాట్లాడారు. రైతులు చనిపోతున్నా జగన్ కనీసం పట్టించుకోలేదని వైఎస్ షర్మిల మండిపడ్డారు. వైఎస్సార్ చేపట్టిన జలయజ్ఞాన్ని కూడా నిర్లక్ష్యంగానే వదిలేశారని విమర్శలు చేశారు. ఆరునెలల్లో మొత్తం ప్రాజెక్టులు పూర్తి చేస్తానని జగన్ చెప్పారని.. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క ప్రాజెక్టుని కూడా పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేశారని దుయ్యబట్టారు. ఐదేళ్లలో ప్రజా సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. కనీసం వైసీపీ కార్యకర్తలకు కూడా అందుబాటులో లేకుండా పోయారని.. ఇప్పుడేమో 2.0 అంటూ మొహం చూపిస్తాడట అని ఎద్దేవా చేశారు వైఎస్ షర్మిల. 'ప్రజలను నమ్మించే ప్రయత్నం జగన్ చేస్తాడట. ఆయనకి ప్రజా సమస్యలు కాదు.. కావాల్సినవి బలప్రదర్శనలు. అందుకే పర్యటనల పేరుతో బలప్రదర్శనలు చేస్తున్నారు. జగన్ చేసిన బలప్రదర్శనలకు ముగ్గురు బలి అయ్యారు. ఆయన ప్రదర్శనలపై ఏపీ ప్రభుత్వం నిషేధం విధించాలి. హత్యలు చేసిన వాళ్లు, చంపిన వాళ్లు ఒప్పుకుంటారా..? వివేకా బాబాయినీ హత్య చేయించి సునీత మీదే తోశాడు. ఇప్పుడు సింగయ్యను చంపి ఏఐ అంటున్నారు. బాబాయిని చంపి సునీత మీద నెట్టివేసిన వాళ్లకు సింగయ్య మృతి మీద అబద్దాలు చెప్పడం ఒక లెక్కా..? వివేకా హత్య కేసులో సీబీఐ అన్ని ఆధారాలు చూపించింది. హత్య చేసిన వాళ్లు, చేయించిన వాళ్లతో మాట్లాడిన సంభాషణలు ఉన్నాయని సీబీఐ చెప్పింది. అయినా మేము చంపలేదు.. మాకు ఏం తెలియలేదని మాట మార్చలేదా..? ఇప్పుడు సింగయ్య హత్య కూడా అంతే' అని షర్మిల ధ్వజమెత్తారు.

## పాన్ మసాలా ప్రకటనలు నిషేధించాలి

గుంటూరు: పాన్ మసాలా ప్రకటనలను ఎందుకు నిషేధించరని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ప్రశ్నించారు. ఈ ప్రకటనల్లో స్టార్ హీరోలు పాల్గొనడం దారుణమని అన్నారు.

పాన్ మసాలా కొనమని స్టార్ హీరోలు, హీరోయిన్స్ ప్రచారం కల్పించడం బాధాకరమన్న ఆయన.. పాన్ మసాలా తయారీ కేంద్రాలను గుర్తించి సీజ్ చేయాలని సూచించారు.. గుంటూరులో ఆయన మాట్లాడుతూ.. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు మాదకద్రవ్యాల నియంత్రణ కోసం కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు.. రాష్ట్రంలో గంజాయి సాగును గుర్తించి వాటి మూలాలను నిర్మూలించాల న్నారు.. పాన్ మసాలాతోపాటు 10 రూపాయలు అదనంగా ఇస్తే కిందనుండి మరో చిన్న ప్యాకెట్ తీసి బై వన్ గెట్ వన్ లాగా ఇస్తున్నారు. చిన్న ప్యాకెట్లు వలన చాలా ప్రమాదం ఉంది. క్యాన్సర్ బారిన పడే ప్రమాదం లేకపోలేదని హెచ్చరించారు.. కేంద్రం చంద్రబాబు చేతుల్లో ఉంది కాబట్టి గుట్కా, పాన్ మసాలా తయారీ, ఉత్పత్తి కేంద్రాలను కట్టడి చేయాలని సూచించారు సీపీఐ నారాయణ.. చిన్న చిన్న షాపులను, వ్యక్తులను పట్టుకుంటూ వీధిలో నాటకాలు వేస్తే ఉపయోగం ఉండదన్నారు.. ఇక, గతంలో అమరావతి రాజధాని కోసం 30 వేల ఎకరాలను తీసుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పరిపాలనలో అమరావతి రాజధాని అభివృద్ధి కుంటుపడింది.. మరల చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత అమరావతి రాజధానికి పునర్జన్మ వచ్చిందన్నారు.. కేంద్ర ప్రభుత్వం సహకారంతో చంద్రబాబు ఏడాదిగా పరిపాలన చేస్తున్నారు.. అమరావతి రాజధాని నిర్మాణం కోసం మరో 40 వేల ఎకరాలు కావాలని చంద్రబాబు మాట్లాడడం బాధాకరం.. రైతులు మరలా భూములు ఇచ్చేందుకు ఆసక్తిగా లేరన్నారు.

# రాజమహేంద్రి అంటేనే గోదావరి



**రాజమహేంద్రవరం:** రాజమహేంద్రవరం అంటే గుర్తుకొచ్చేది గోదావరి తీరమని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. పుష్కర ఘాట్ వద్ద అఖండ గోదావరి ప్రాజెక్టుకు గురువారం ఉదయం కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేష్, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి స్థానిక నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. రాజమండ్రి అంటే గుర్తుకొచ్చేది గోదావరి తీరం అన్నారు. అలాగే డొక్కా సీతమ్మ, ఆదికవి నన్నయ్యకు జన్మనిచ్చిన నేల గోదావరి ప్రాంతమని పేర్కొన్నారు. మరోవైపు రూ.430 కోట్లతో ఏపీలో పర్యాటక ప్రాజెక్టులు చేపడుతున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పుకొచ్చారు. తీరం వెంట నాగరికత, భాష అన్నీ అభివృద్ధి చెందుతాయని చెప్పారు. ఆంధ్రుల అన్నపూర్ణగా పేరుగాంచిన డొక్కా సీతమ్మకు జన్మనిచ్చిన నేల ఇది అని చెప్పారు. 'ఆదికవి నన్నయ్యతో పాటు ఎంతో మంది కళాకారులకు జన్మనిచ్చిన నేల ఇది. ఎంతో కాలంగా ఉన్న కలను సాకారం చేసే దిశగా ముందుకెళ్లడం ఆనందదాయకం. పర్యాటక రంగంలో యువతకు ఎక్కువ ఉపాధి అవకాశాలు ఉంటాయి. ప్రాజెక్టు పూర్తయితే ఏటా 4 లక్షల మంది పర్యటకులు పెరిగే అవకాశముంది. శక్తిమంతమైన నాయకులు, ప్రభుత్వం ఉంటే అభివృద్ధి వేగవంతమవుతుందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఆపగలిగామంటే దానికి కేంద్రమంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ కారణం. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఆయన ప్రత్యేక కృషి చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పర్యటక కేంద్రాలకు పునరుజ్జీవం అందించాలని కోరుతున్నాం. రాజస్థాన్‌లో వీరులు పుట్టిన నేల నుంచే గజేంద్ర సింగ్ షెకావత్ వచ్చారు. ఆంధ్రుల పౌరుషం ఉన్న ఈ నేల స్వభావాన్ని అర్థం చేసుకుంటున్నారని పవన్ కల్యాణ్ చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలతో పర్యాటక రంగంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్‌తో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగంగా అభివృద్ధి చేస్తున్నాయని ప్రశంసించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా కేంద్ర మంత్రి షెకావత్ సహకారం అందించారన్నారు. అలాగే పోలవరం ప్రాజెక్టు కోసం షెకావత్ సహకారం అందించారని కొనియాడారు. ఏపీలో 974 కిలోమీటర్ల నదీ తీరం ఉందని, విదేశాల్లో నదీ తీరాలను పర్యాటక రంగంగా అభివృద్ధి చేసిన విధంగా అఖండ గోదావరి ప్రాజెక్టును పర్యాటకంగా తీర్చిదిద్దుతామన్నారు. 2035 నాటికి రాష్ట్రవ్యాప్తంగా ఏపీలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. రాజమండ్రి వద్ద గోదావరిపై 127 సంవత్సరాల చరిత్ర ఉన్న హేవలాక్ రైల్వే వంతెనను టూరిజం స్పాట్‌గా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. రాజమండ్రి రూరల్ బొమ్మూరులో రూ.15 కోట్లతో నిర్మాణం చేపట్టిన సైన్స్ మ్యూజియాన్ని కేంద్ర మంత్రి షెకావత్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రారంభోత్సవం చేయనున్నారు. అలాగే దివాన్ చెరువు వద్ద రూ.30 కోట్ల వ్యయంతో ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ అకాడమీకి శంకుస్థాపన చేయనున్నారు. అఖండ గోదావరి ప్రాజెక్టు శంకుస్థాపనకు కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వస్తున్న సందర్భంగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిశోర్ పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో

ప్లాస్టిక్ రహితంగా నిర్వహిస్తున్నామని, తాగునీటికి ప్లాస్టిక్ వాడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించామ న్నారు. పుష్కర్‌ఘాట్ వద్ద గజ ఈతగాళ్లు, రెస్క్యూ బోట్లను అందుబాటులో ఉంచామన్నారు.

# ఆత్మహత్య కోసమే పట్టాలపైకి కారు


## హాట్‌టాపిక్‌గా యువతి వ్యవహారం

హైదరాబాద్:శంకర్ పల్లి రైలు పట్టాలపై కారు తీసుకెళ్లిన లేడీ కేసులో కొత్తకోణం వెలుగులోకి వచ్చింది.. ఆత్మహత్య చేసుకునేందుకు కారుతో సహా పట్టాల మీదకి వెళ్ళినట్లు పోలీసులు గుర్తించారు. గురువారం ఉదయం తాను ఉంటున్న ఫ్లాట్ నుంచి కార్ తో సహా బయటికి వచ్చింది సోనీ. తన దగ్గరున్న కుక్కను నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో వదిలి వెళ్ళిపోయింది. సూసైడ్ చేసుకోవడానికి కార్ తీసుకొని రైలు పట్టాలపైకి వచ్చింది. కుటుంబ కలహాలే దీనికి ప్రధాన కారణమని పోలీసుల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆర్మీలో జాబ్ చేయాలని సోనీ ప్రయత్నం చేసింది.. కానీ తల్లిదండ్రులు ఒప్పుకోలేదు.. మరోవైపు తాను పనిచేస్తున్న సాఫ్ట్వేర్ కంపెనీ నుంచి ఉద్యోగం తొలగించారు. తల్లిదండ్రుల ఆర్మీ జాబు నిరాకరణ, ఉద్యోగం పోవడంతో మానసిక ఆందోళన చెందింది. కార్ తో సహా ట్రైన్ కు ఎదురెళ్లి ఆత్మహత్య చేసుకోవాలని ప్లాన్ చేసింది. అయితే ఇదంతా రీల్స్ కోసమని తొలుత భావించారు. వివరాల్లోకి వెళితే రైలు పట్టాలపై ఓ యువతి హల్‌చల్ చేసింది. ఆమె నిర్వాకంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. నాగులపల్లి-శంకర్‌పల్లి మార్గంలో పట్టాలపై సుమారు 7 కి.మీ మేర యువతి కారు నడిపింది. కారును అడ్డగించిన స్థానికులను ఆమె చాకుతో బెదిరించింది. అదే మార్గంలో వస్తున్న ఓ రైలు లోకో పైలట్ గమనించి ట్రైన్‌ను ఆపారు. స్థానికులు అతికష్టం మీద యువతిని పట్టుకున్నారు. యువతి చేసిన పనితో సుమారు 2 గంటల పాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. అనంతరం శంకర్‌పల్లి పోలీసులు అక్కడికి చేరుకుని ఆమెను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పట్టాలపై కారు నడిపిన యువతిని లక్నోకి చెందిన రవికా సోనీగా గుర్తించారు. రీల్స్ కోసమే ఈ నిర్వాకానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఆమె హైదరాబాద్‌లోని ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తించినట్లు సమాచారం. ఇటీవల రవికా సోనీని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ క్రమంలో ఆమె మతిస్థిమితం కోల్పోయిందా? డ్రగ్స్ తీసుకుందా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. ప్రస్తుతం యువతిని చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి అప్పగించాలి.

సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి విలేఖరులతో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో సి బి ఐ విచారణ జరిగితే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయి. ఫోన్ ట్యాపింగ్ లో కేవలం రాజకీయ నేతలనే కాకుండా అన్ని వర్గాల బాధితులు ఉన్నారు . ఫోన్ ట్యాపింగ్ కేసు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పై అనుమానాలు ఉన్నాయి . టెలిఫోన్ ట్యాపింగ్ ద్వారా బి ఆర్ ఎస్ నాయకులు వ్యక్తిగత స్వేచ్ఛను హరించారు. ఇది సాదా సీదా కేసు కాదు అని, తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు ఈ కేసు సిబిఐ కు అప్పగించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు.

అరవింద్ హామీ మేరకు "పసుపు బోర్డు"



జిల్లాకు బహుమతి.

మహారాష్ట్ర,మధ్యప్రదేశ్ రాష్ట్రాలు జాతీయ పసుపు బోర్డు కోసం ఒత్తిడి చేసినప్పటికీ ప్రధాని మోదీ మాత్రం నిజామాబాద్ కు కేటాయించారు. ఇది జిల్లాకు ఒక బహుమతి అని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. దశాబ్దాల పసుపు రైతుల చిరకాల కోరిక అయిన పసుపు బోర్డ్ కేంద్ర కార్యాలయాన్ని కేంద్ర హోమంత్రి అమిత్ షా ప్రారంభిస్తారు అని తెలిపారు. ఇందూరు జిల్లా రైతు ఉద్యమాలకు, చైతన్యానికి ప్రతీక అని వారు పసుపు బోర్డు కోసం పోరాటాలు చేస్తుండగా ఎంపి ధర్మపురి అరవింద్ రైతులకు ఇచ్చిన హామీ మేరకు కేంద్రం మంజూరు చేసిందని అన్నారు. జిల్లా కేంద్రంలో జాతీయ పసుపు బోర్డు కార్యాలయంను ప్రారంబించిన ఆనంతరం జరిగే రైతు సదస్సులో అమిత్ షా పసుపు బోర్డు లోగోను ఆవిష్కరిస్తారు అని తెలిపారు. దివంగత నేత డీ శ్రీనివాస్ ప్రథమ వర్ధంతి సందర్భంగా కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా డీ ఎస్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు అని పేర్కొన్నారు. ఈ విలేఖరుల సమావేశంలో నిజామాబాద్ ఎంపి ధర్మపురి అర్వింద్, జాతీయ పసుపు బోర్డు చైర్మెన్ పల్లె గంగారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారీ, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యానారాయణ, ఎమ్మెల్సీ అంజల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...

# జీజీహెచ్‌ను సందర్శించిన కలెక్టర్, హెల్త్ డైరెక్టర్.

**అందుబాటులో ఉన్న సదుపాయాల పరిశీలన.**

**వైద్య విభాగాల అధిపతులతో సమీక్ష.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 26**

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వైద్య కళాశాలలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్ గురువారం సందర్శించారు. వివిధ విభాగాలను సందర్శించి అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. ఆసుపత్రిలో ఐ.సీ.యు, ఆర్.ఐ.సీ.యు, ల్యాబ్, బ్లడ్ బ్యాంకు, టీ.హబ్ తదితర వాటిని తనిఖీ చేశారు. వైద్య కళాశాలలో ఫిజియాలజి, అనాటమీ, హెమటాలజి ల్యాబులు, లైబ్రరీ, లెక్చర్ హాల్ ఇతర విభాగాలను సందర్శించారు. అనంతరం జీజీహెచ్ సూపరింటెండెంట్ ఛాంబర్లో ఆయా విభాగాల అధిపతులతో సమావేశమై అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించారు. ఒక్కో విభాగం వారీగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, డాక్టర్లు, సిబ్బంది ఖాళీలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఇంకనూ కొత్తగా సమకూర్చాల్సిన సదుపాయాలు తదితర వాటి గురించి కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ మేరకు కొత్తగా ఏయే సదుపాయాలు, వైద్య పరికరాలు, యంత్రాలు అవసరం అన్నది గుర్తిస్తూ సమగ్ర నివేదిక సమర్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ లను ఆదేశించారు. ఈ నివేదికను అనుసరిస్తూ సదుపాయాల మెరుగుదల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని తెలిపారు. ఆసుపత్రి, మెడికల్ కాలేజీల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా, తమ దృష్టికి తేవాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం అవసరమైన అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా ప్రజలకు సంతృప్తికరంగా వైద్య సేవలు అందించాలని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. అన్ని విభాగాల పనితీరు మరింతగా మెరుగుపడేలా అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, వైద్య సేవల్లో జిల్లాకు మంచి పేరు తేవాలని అన్నారు. తాను క్రమం తప్పకుండా ఆసుపత్రిని తనిఖీ చేస్తానని, వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. జీజీహెచ్ ఆధ్వర్యంలో అందిస్తున్న అధునాతన వైద్య సేవల గురించి ప్రజలకు తెలిసేలా చూడాలని, తద్వారా ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు పట్ల ప్రజల్లో నమ్మకం పెంపొందుతుందని సూచించారు. వైద్య కళాశాలలో జాతీయ మెడికల్ కౌన్సిల్ నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన అన్ని వసతులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, తద్వారా ఎన్ఎంసీ అనుమతుల మంజూరీలో ఇబ్బందులకు ఆస్కారం ఉండదని కలెక్టర్ సూచించారు. వైద్య విద్యార్థులు సంఖ్యకు అనుగుణంగా ప్రొఫెసర్ లు, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, బోధనేతర సిబ్బంది ఉండాలన్నారు. ఆయా విభాగాలలో ఖాళీలు ఉంటే, వాటి వివరాలను సమర్పించాలని కళాశాల ప్రిన్సిపాల్ కు సూచించారు. వీరి వెంట డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, వైద్య విభాగాల అధిపతులు ఉన్నారు.





# నలందలో "ఉపాధ్యాయులకు శిక్షణ".

**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, జూన్ 26:**

పట్టణంలోని మామిడిపల్లిలో గల నలంద హైస్కూల్లో గురువారం ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాతృశ్రీ పబ్లిషర్స్ వారి ఆధ్వర్యంలో బోధనా మెలుకువలపై తరగతులు నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఈ విద్యా సంవత్సరం విద్యార్థులకు ఏ విధంగా విద్యను అందించాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు చేపట్టారు. ఈ యొక్క శిక్షణ తరగతులలో విద్యార్థులకు టీచింగ్ మెథడాలజీ, యాక్టివిటీస్, ప్రాజెక్టు వర్క్, స్పీకింగ్ , మరియు రీడింగ్ అనే అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. మాతృశ్రీ పబ్లిషర్స్ ఏఎం శంకర్, ట్రైనర్ శామ్యూల్ ఆధ్వర్యంలో ఈ తరగతులు కొనసాగాయి. మాతృశ్రీ ట్రైనర్స్ ని నలంద యాజమాన్యం ప్రసాద్, సాగర్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఒలంపియాడ్ స్కూల్ ఉపాధ్యాయులు మరియు అకాడమిక్ ఇంచార్జ్ అతోఫా నౌషిన్ పాల్గొన్నారు.



**మాతృశ్రీ పబ్లిషర్స్ వారి ఆధ్వర్యంలో బోధనా మెలుకువలపై తరగతులు.**

**పాల్గొన్న యాజమాన్యం ప్రసాద్, సాగర్.**



# కేంద్ర హోంమంత్రి పర్యటన ఏర్పాట్లపై కలెక్టర్, సీ.పీ సమీక్ష.

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, జూన్ 26**

జిల్లా కేంద్రంలో నూతనంగా నెలకొల్పిన జాతీయ పసుపు బోర్డు కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఈ నెల 29 కేంద్ర హోంమంత్రి అమిత్ షా విచ్చేస్తున్న సందర్భంగా ఆయన పర్యటన ఏర్పాట్లపై గురువారం ఐ.డీ.ఓ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా కేంద్ర మంత్రి అమిత్ షా హాజరు అవుతుండడంతో, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని హెలిప్యాడ్ ను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్ అండ్ బీ అధికారులకు సూచించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా కేంద్ర హోం మంత్రి పర్యటనకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. భద్రతా పరంగా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు చేపట్టాలని సీ.పీ సాయి చైతన్య పోలీసు అధికారులకు సూచించారు. సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ లు అంకిత్, కిరణ్ కుమార్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# మాదక ద్రవ్యాలతో జీవితాలు అంధకారం.







**విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలి.**

**సిరికొండ ఎస్ఐ యల్. రామ్.**

**"సత్యశోధక్" పాఠశాల విద్యార్థుల భారీ ర్యాలీ, మానవహారం.**

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, జూన్ 26:**

మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జీవితాలు అంధకారంగా మారుతాయని, విద్యార్థులు, యువత అప్రమత్తంగా ఉండాలనీ సిరికొండ ఎస్ఐ యల్. రామ్ పేర్కొన్నారు. కుటుంబాలకు బాధను, సమాజానికి హానిని చేకూర్చే మాదక ద్రవ్యలా పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల నిర్మూలన మరియు అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం సత్యశోధక్ పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అధ్యక్షతన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఐ హాజరై, మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్, మద్యం, దూమ పానం, గంజాయి లాంటి వాటికి దూరంగా ఉండాలని, వాటి వలన ఆనారోగ్యాల బారిన పడడమే కాకుండా జీవితాలు నాశనమౌతాయాన్నారు. విద్యార్థులు, యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వ్యసనంతో ముప్పు వాటిల్లుతుందని, నేటి ఆధునిక పోటీ వ్యవస్థలో విద్యార్థులు చదువుల పట్ల శ్రద్ధ వహించాలని, పాఠశాలలో ఉపాధ్యాయులు బోధించే విషయాలను అవగాహన చేసుకొని విషయ పరిజ్ఞానాన్ని పెంచుకొని, భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో స్థిరపడాలన్నారు. విద్యార్థులు సెల్ ఫోన్ తో కాలక్షేపం వలన చదువులకు నష్టం వాటిల్లుతుందని, సామాజిక మధ్యమాలకు దూరంగా ఉండాలని అన్నారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలను తల్లిదండ్రులకు, కుటుంబ సభ్యులకు అవగాహన కల్గించాలన్నారు. అనంతరం పోలీస్ శాఖ తరపున "మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు సమాజంపై దాని ప్రభావం" అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలోని విజేతలకు మెడల్స్, ప్రశంస పత్రాలను అందించి అభినందించారు. తదనంతరం సిరికొండలో మాదకద్రవ్యాల నిర్మూలన పై విద్యార్థుల ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలి తెలంగాణ చౌరస్తా వద్ద మానవహారంగా ఏర్పడి మాదకద్రవ్యాల నిర్మూలన నినాదాలు చేస్తూ ప్రజలను చైతన్యం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పాఠశాల బోధనా సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం.

## - పోలీస్ కమీషనర్ సాయి చైతన్య పిలుపు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాదు జూన్ 26**

డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలనిపోలీస్ కమీషనర్ సాయి చైతన్య పిలుపునిచ్చారు.అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం నగరంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని సిపి సాయి చైతన్య, ట్రైని ఐఏఎస్ కరో లీనా చాంగ్ ఎన్. మావి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి సాయి చైతన్య మాట్లాడుతూ, మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరియు దుర్వినియోగంపై జరుగుతున్న పోరాటంలో అందరూ క్రియాశీల భాగస్వామ్యం కావాలని, మాదకద్రవ్యాలు వాడటం వలన కలిగే దుష్పరిణామాల గురించి సంపూర్ణ అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందని, సమాజంలో ఏ ఒక్కరూ కూడా డ్రగ్స్ బారిన పడకుండా కృషి చేయాలని కోరారు. డ్రగ్స్ అమ్మకం కొనుగోలు చేసే వ్యక్తుల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం సంకల్పించిందని అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం మరియు అక్రమ రవాణాకు వ్యతిరేకంగా స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థిని విద్యార్థులు సమాజంలో ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయడానికి అవగాహన కల్పించే విధంగా పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బి ర్యాలీలో పాల్గొన్న అందరితో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ బసవ రెడ్డి, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ డిప్యూటీ కమిషనర్ సోము రెడ్డి, నిజామాబాద్ ఏసిపి ఎస్ హెచ్ ఓ, పోలీసులు సిబ్బంది, ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్వైజర్లు ఐ సిపిఎస్, చైల్డ్ హెల్ప్ లైన్ డి హెచ్ ఈ డబ్ల్యూ, సిబ్బంది వివిధ కళాశాలల విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.





# మంత్రులు ఉన్న జిల్లాకే "ఇంజనీరింగ్" కళాశాలలు.

**యూనివర్సిటీ ఉన్న నిజామాబాద్ కు కళాశాల లేకపోవడం దారుణం.**

**పిడిఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వి. శ్రీకాంత్.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 26:**

మంత్రులు ఉన్న జిల్లాల్లోనే ఇంజనీరింగ్ కళాశాలలు మంజూరు చేసుకుంటున్నారని, తెలంగాణ యూనివర్సిటీ ఉన్న నిజామాబాద్ లో కళాశాల ఏర్పాటు చేయకుండా ప్రభుత్వం అన్యాయం చేస్తున్నదని పిడిఎస్ యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ వి. శ్రీకాంత్ ఆరోపించారు. నిజామాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల కోసం ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. నగరంలోనీ జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ లైబ్రరీలో గురువారం పీడీఎస్ యు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్వీ శ్రీకాంత్ మాట్లాడుతూ, జిల్లాలో యూనివర్సిటీ ఉన్నా గాని ఇంజనీరింగ్ కాలేజ్ లేదని, ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల విద్యార్థులు ఇంజనీరింగ్ చేయాలంటే హైదరాబాద్ వెళ్ళాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాకు కళాశాల ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డితో సహా ప్రజాప్రతినిధులు అనేక సార్లు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. విద్యారంగం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతుందనీ, అనేక ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు లేక శిథిలవ్యవస్తలో ఉన్నాయని, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయకపోవడం వల్ల విద్యార్థులు సర్టిఫికెట్లు యాజమాన్యాలు ఇవ్వటం లేదని అన్నారు. రాష్ట్రంలో ప్రవేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఫీజుల నియంత్రించడానికి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావడం లేదని, అదేవిధంగా విద్యా హక్కు చట్టాన్ని కూడా సక్రమంగా అమలు చేయడం లేదని అన్నారు. విద్యారంగా సమస్యలు వెంటనే రాష్ట్రప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్. గౌతం కుమార్, జన్నారపు రాజేశ్వర్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రిన్స్, జిల్లా కమిటీ సభ్యులు దేవిక, నిఖిల్, సాయినాథ్, హుస్సేన్, శ్రీకాంత్, తదితదిరులు పాల్గొన్నారు.




# డీవీకే ఆశయాలు కొనసాగిద్దాం.

## - సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ.




**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, జూన్ 26:**

విప్లవోద్యమ నాయకుడు, ఆదర్శ కమ్యూనిస్టు, ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి డీవీ కృష్ణ ఆశయాలు కొనసాగిద్దాం అని సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ అన్నారు. డీవీకే 3వ వర్ధంతి సభ సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నిజామాబాద్ అర్బన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రేడియో స్టేషన్ ఎదురుగా డీవీకే నగర్ లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం.ఎల్) మాస్ లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వనమాల కృష్ణ మాట్లాడుతూ, డి.వి కృష్ణ ఆదర్శ కమ్యూనిష్టు అని, విప్లవోద్యమానికి, ఆయన చేసిన కృషి అజరామరం అని కొనియాడారు. డీవీకే సైద్ధాంతిక, రాజకీయ రంగాలన్నింటినీ నిశితంగా పరిశీలన చేసి సరైన సిద్ధాంతం కోసం మొక్కవోని పోరాటం చేశాడన్నారు. 50 సంవత్సరాల విప్లవ జీవితమంతా విప్లవోద్యమం నిర్మించడానికి, అతివాదాన్ని, మితవాదాన్ని వ్యతిరేకించి నిలబడ్డాడని అన్నారు. పార్టీని సరైన పంథాలో తీర్చిదిద్దడానికి కృషి చేశాడన్నారు. డీవీ కృష్ణ ఆశలు, ఆకాంక్షలు, ఆశయాలు ఉన్నతమైన వన్నారు.దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, లౌకికత్వం ప్రశ్నార్ధకంగా మారుతున్న పరిస్థితి ఉన్నదన్నారు. పాలకవర్గాలు ప్రజలకు నాణ్యమైన విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పించకుండా, ప్రజావ్యతిరేక చర్యలను అవలంబిస్తు న్నాయని అన్నారు. ప్రైవేటీకరణ కార్పొరే టీకరణ విధానాలను వేగంగా అమలు చేస్తున్నాయన్నారు. ఈ పాలకవర్గాల ప్రజా వ్యతిరేక విధానాల వ్యతిరేకంగా పోరాడా ల్సిన బాధ్యత మన మీద ఉందన్నారు. ఈ సభలో మాస్ లైన్ రాష్ట్ర నాయకులు ఎం. నరేందర్, నిజామాబాద్, బోధన్ డివిజన్ కార్యదర్శులు ఎం.వెంకన్న, డీ.రాజేశ్వర్, నగర కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు కే.గంగాధర్, బి.మల్లేష్, సిహెచ్ సాయన్న, డి.కిషన్ బి.మురళి, పి. సాయన్న పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.గోదావరి, కే.సంధ్యారాణి, వీడియోస్ జిల్లా కార్యదర్శి కే.గణేష్ జిల్లా ఉపాధ్యక్షులు సాయిబాబా టియుసిఐ జిల్లా నాయకులు కిరణ్, రవి అరుణోదయ జిల్లా నాయకులు కే గంగారం, పాల్గొన్నారు.



# సభ స్థలిని పరిశీలించిన కిషన్ రెడ్డి, అరవింద్.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**

ఈ నెల 29 న నిజామాబాద్ పాలిటెక్నిక్ మైదానం లో జరిగే కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభ ఏర్పాట్లను కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన వెంట నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి, అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్య నారాయణ, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి ఉన్నారు.



# అర్బన్ ఫారెస్టుల అభివృద్ధికి కృషి

హైదరాబాద్: హైదరాబాద్ నగరం చుట్టూ ఉన్న అర్బన్ ఫారెస్ట్ బ్లాక్‌లను అభివృద్ధి చేస్తున్నారు. పచ్చదనంలో భాగంగా పార్కులకు మహర్దశ కలుగనుంది. హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్ పార్కులుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. నగరం చుట్టూ వివిధ ప్రాంతాల్లో 189 అర్బన్ ఫారెస్ట్ బ్లాక్ లు ఉండగా, 45 బ్లాక్ లను పార్కులుగా అభివృద్ధి చేస్తున్నామని, వీటిలో 17 పార్కులు పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. దశల వారీగా వీటిని అభివృద్ధి చేస్తామంటున్నారు. అర్బన్ ఫారెస్ట్?పార్కులను అభివృద్ధి చేయడం వల్ల ప్రజలకు విహార కేంద్రాలుగా ఉపయోగపడతాయని, ఫ్యామిలీతో వెళ్లి గడపడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు తెలిపారు. అలాగే నగరంలో పచ్చదనం పెంచడంపై హెచ్ఎండీఏ దృష్టి పెట్టింది. ముఖ్యంగా ఔటర్ రింగ్‌రోడ్, నేషనల్‌హైవేస్, ట్రిపుల్‌ఆర్‌వరకు ఆయా ప్రాంతాల్లో పచ్చదనాన్ని విస్తరించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. త్వరలో నిర్వహించనున్న వనమహోత్సవంలో భాగంగా 4.5 కోట్ల మొక్కలు నాటాలని అర్బన్ ఫారెస్టీ ఆఫీసర్లు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గతేడాది వనమహోత్సవం కింద 6.8 కోట్ల మొక్కలు నాటామని, ఇది మంచి ఫలితాలు ఇవ్వడంతో ఈసారి 4.5 కోట్ల మొక్కలు నాటాలని నిర్ణయించినట్టు చెబుతున్నారు. వన మహోత్సవం కోసం 42 హెచ్ఎండీఏ నర్సరీల్లో వివిధ రకాలకు చెందిన 5 కోట్ల మొక్కలు పెంచుతున్నట్టు తెలిపారు.






# శ్రీశైలం మల్లన్నను దర్శించుకున్న మంచు విష్ణు

ప్రముఖ సినీ నటుడు, నిర్మాత మంచు విష్ణు 12 జ్యోతిర్లింగాల దర్శన యాత్రను పూర్తి చేశారు. ఈ యాత్రలో భాగంగా 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం మల్లికార్జున స్వామిని బుధవారం దర్శించుకున్నారు. ఈ విషయాన్ని మంచు విష్ణు తన సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. మంచు విష్ణు ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం కన్నప్ప. మంచు ఫ్యామిలీ ప్రెస్టీజియస్‌గా తెరకెక్కిస్తున్న ఈ చిత్రం జూన్ 27న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు నటుడు మంచు విష్ణు. భక్తిరస చిత్రంగా రాబోతున్న ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. మంచు విష్ణు గత కొంతకాలంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న జ్యోతిర్లింగాలను సందర్శిస్తూ వస్తున్నారు. ఈ యాత్రలో భాగంగా ఆయన కేదార్‌నాథ్, రామేశ్వరం, సోమనాథ్ వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించారు. ఇక 12 జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైలం మల్లికార్జున స్వామిని దర్శించుకోవడంతో ఆయన 12 జ్యోతిర్లింగాల యాత్ర పూర్తయింది. తాజాగా ఈ విషయాన్ని మంచు విష్ణు వెల్లడించారు. శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో దర్శనం పూర్తవడంతో, పన్నెండు జ్యోతిర్లింగాలను దర్శించుకోవాలన్న తన కోరిక నెరవేరిందని విష్ణు ఆనందం వ్యక్తం చేశారు. “నా మనసు నిండిపోయింది. నా ఆత్మ ఆశీర్వదించబడినట్లు అనిపిస్తుంది. జీవితం ప్రస్తుతం సానుకూలత, కృతజ్ఞత మరియు శాంతితో నిండి ఉంది” అని ఆయన ట్వీట్ చేశారు. జూన్ 27న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ‘కన్నప్ప’ చిత్రం తన హృదయానికి చాలా దగ్గరైనదని, ఈ సినిమా కథ తాను ప్రస్తుతం అనుభవిస్తున్న స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు. హర్ హర్ మహాదేవ్! అంటూ ఆయన తన ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు.

# సుమంత్ సినిమాను మెచ్చుకున్న మహేశ్



మహేష్ బాబు ఎంత పెద్ద స్టార్ హీరోనో అంతే మంచి మనిషి.. సాయంలోనే కాదు తన సినిమాలతో పాటు పక్కవారి సినిమాలను కూడా ఎంతో సపోర్ట్ చేస్తూ ఉంటారు. చిన్న సినిమా పెద్ద సినిమా అని తేడా లేకుండా తన సపోర్ట్ అందిస్తూ ఉంటారు. ఇప్పటికే మహేష్ బాబు ఎన్నో సినిమాల టైటిల్స్, టీజర్లు, సాంగ్స్ ను రిలీజ్ చేశారు. అలాగే తాను చూసిన సినిమా ఏదైనా మంచిగా అనిపిస్తే వెంటనే సోషల్ మీడియా వేదికగా ఆ సినిమా టీమ్ కు అభినందనలు తెలుపుతారు మహేష్. ఈ క్రమంలోనే ఇప్పుడు ఆయన ఓ ఎమోషనల్ డ్రామా పై ప్రశంసలు కురిపించారు. ఇటీవలే కుబేర సినిమా పై ప్రశంసలు కురిపించిన మహేష్ తాజాగా మరో సినిమాను అభినందిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ సినిమా ఏ దంటే.. ఇటీవల విడుదలై మంచి రెస్పాన్స్ సొంతం చేసుకున్న సినిమాల్లో అనగనగ సినిమా ఒకటి. సుమంత్, కాజల్ చౌదరి జంటగా నటించిన ఈ సినిమా ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కింది. ఈ సినిమాలో సుమంత్ తన నటనతో ఆకట్టుకున్నాడు. ఈ సినిమా డైరెక్ట్ గా ఓటీటీలో విడుదలైంది. తండ్రి కొడుకు మధ్య ఉండే ఎమోషనల్ బాండ్ ను చక్కగా చూపించారు. ఈ సినిమా చూసిన ప్రేక్షకులు తమ అభిప్రాయాన్ని ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా తెలిపారు. తాజాగా మహేష్ బాబు కూడా ఈ సినిమా పై ప్రశంసలు కురిపించాడు.



# టాలీవుడ్‌లో కనిపించని బేబమ్మ

ఉప్పెన సినిమాతో సినీరంగంలోకి అడుగుపెట్టింది. మొదటి సినిమాతోనే ఇండస్ట్రీలో సంచలనం సృష్టించింది ఈ వయ్యారి. బ్యాక్ టూ బ్యాక్ హిట్ సినిమాలతో ఆకట్టుకుంది. ఆ తర్వాత శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు సినిమాలతో హ్యాట్రిక్ హిట్స్ ఖాతాలో వేసుకుంది ఈ వయ్యారి. తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ సంపాదించుకుంది. అయితే వరుసగా మూడు హిట్స్ ఖాతాలో వేసుకున్న ఈ వయ్యారి.. ఆ తర్వాత ఆమె కెరీర్ ఊహించని విధంగా మారిపోయింది. వరుసగా హ్యాట్రిక్స్ హిట్స్ అందుకున్న మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి, మనమే వంటి సినిమాలు వరుస ఫ్లాపులు పడ్డాయి. దీంతో తెలుగులో అవకాశాలు తగ్గిపోయాయి. ప్రస్తుతం జస్ట్ ఫర్ ఛేంజ్ చిత్రంతో మలయాళంలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాతో అక్కడ బేబమ్మకు మంచి క్రేజ్ వచ్చేసింది. ఇక ఇప్పుడు తమిళంలోనూ అవకాశాలు అందుకుంటుంది. కార్తీ సరసన వా వాతియార్ సినిమాలో నటిస్తుంది. ఇప్పటికే ఈ మూవీ విడుదల కావాల్సి ఉండగా అనుహ్యంగా వాయిదా పడింది. అలాగే తమిళంలో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ చిత్రంలో నటిస్తుంది. ఈ మూవీ సెప్టెంబర్ 18న అడియన్స్ ముందుకు రానుంది. వీటితోపాటు జీని అనే తమిళంలో చిత్రంలో నటిస్తుంది. ఇవే కాకుండా బేబమ్మకు తమిళంతోపాటు మలయాళంలోనూ మరిన్ని ఆఫర్స్ వస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా మరో క్రేజ్ ఛాన్స్ కొట్టేసింది. పృథ్వీరాజ్ సుకుమార్ రూపొందిస్తున్న ఖలీఫా చిత్రంలో ఈ అమ్మడు కనిపించే ఛాన్స్ ఉన్నట్లు టాక్. 2022లోనే ఈ మూవీ ప్రకటన వచ్చినప్పటికీ ..

పృథ్వీరాజ్ వరుస సినిమాలతో బిజీగా ఉండడంతో సినిమా ఆలస్యమయ్యింది. ఇక ఇప్పుడు జూలై నుంచి ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ కానున్నట్లు తెలుస్తోంది.

# ఆ స్టార్ హీరోయిన్ బాత్రూమ్‌లో నా ఫొటో ఉండేది : సల్మాన్‌ఖాన్



బాలీవుడ్ స్టార్ సల్మాన్ ఖాన్ వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నాడు. రీసెంట్ డేస్ లో సల్మాన్ ఖాన్ నటించిన సినిమాలు వందకోట్ల మార్క్ ను దాటేశాయి. కాగా హిట్స్, ఫ్లాప్స్ తో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేసి మెప్పిస్తున్నారు. ఇటీవలే మురగదాస్ తో కలిసి సికిందర్ అనే సినిమా చేశాడు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా ఊహించని విధంగా డిజాస్టర్ అయ్యింది. ఈ సినిమాలో రష్మిక మందన్న హీరోయిన్ గా నటించింది. అలాగే కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో నటించింది. ఇప్పుడు సల్మాన్ తన సినిమా పనుల్లో బిజీగా ఉన్నాడు. 50 వయసు దాటినా కూడా సల్మాన్ ఖాన్ పెళ్లి చేసుకోకుండా బ్యాచిలర్ గా ఉన్నాడు. అంతే కాదు ఈమధ్య సల్మాన్ ఖాన్ ను చంపేస్తామని ఓ గ్యాంగ్ బెదిరిస్తున్న విషయం తెలిసిందే.. ఇదిలా ఉంటే తాజాగా సల్మాన్ ఖాన్ కపిల్ శర్మ షోకు గెస్ట్ గా హాజరయ్యాడు. ఈ షోలో ఆయన ఆసక్తికర కామెంట్స్ చేశాడు. ఈ షోలో సల్మాన్ ఖాన్ ఫోటోలను ఫ్లెక్సీల్లో, రోడ్డుపక్కన, సెలూన్ షాప్స్ లో ఎలా వాడుకుంటారో ఫోటోలు వేసి చూపించారు. ఈ ఫోటోలకు స్లామం పడిపడి నవ్వుకున్నాడు. అలాగే ఆయన మాట్లాడుతూ హీరోయిన్ కరీనా కపూర్ బాత్రూమ్‌లో కూడా నా పోస్టర్ ఉందని విన్నాను. నేను ఒకసారి వల్ల ఇంటికి కూడా వెళ్లి చూశా.. అప్పుడు ఆమె వయసు 8 ఏళ్ళు ఉంటాయి. ఆతర్వాత ఆమెకు 15 ఏళ్ళు వచ్చాకా నా పోస్టర్ తీసేసి రాహుల్ రాయ్ పోస్టర్ పెట్టుకుంది అని చెప్పుకొచ్చాడు.





# పాండ్యతో డేటింగ్‌పై స్పందించిన నటి ఇషా

టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యతో బాలీవుడ్ నటి ఇషా గుప్తా డేటింగ్‌లో ఉన్నట్లు గత కొన్ని రోజులుగా వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. అయితే ఈ వార్తలపై ఎట్టకేలకు స్పందించింది నటి ఇషా గుప్తా. తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఇషా గుప్తా మాట్లాడుతూ.. అవును, మేమిద్దరం కొంతకాలం మాట్లాడుకున్నాం. కానీ మేము డేటింగ్ చేశామని నేను అనుకోవడం లేదు. కొన్ని నెలల పాటు మా మధ్య సంభాషణలు జరిగాయి. బహుశా ఇది జరగవచ్చేమో, లేదా జరగకపోవచ్చేమో అన్న దశలో ఉండేవాళ్లం. మేం డేటింగ్ దశకు చేరుకోకముందే అది ముగిసిపోయింది. కాబట్టి దాన్ని డేటింగ్ అని చెప్పలేం అని వివరించారు. తమ మధ్య ఎలాంటి గొడవలు లేవని, మనస్పర్థలు కూడా రాలేదని.. అయితే మేము కలవడం అనేది రాసిపెట్టిలేదని తెలిపారు. మేమిద్దరూ చాలా భిన్నమైన వ్యక్తులమని, అందుకే విషయాలు ముందుకు సాగలేదని ఇషా చెప్పుకొచ్చారు.

## భారీ సినిమా నుంచి శ్రీలీల అవుట్

ప్రస్తుతం టాలీవుడ్ లో క్రేజీ బ్యూటీగా దూసుకుపోతుంది అందాల భామ శ్రీలీల. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చిన ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేసి మెప్పిస్తుంది. పెళ్లి సందడి సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ కు పరిచయమైంది శ్రీలీల. తొలి సినిమానే దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు దర్శకత్వ పర్యవేక్షణలో చేసింది ఈ చిన్నది. ఆతర్వాత మాస్ మహారాజ రవితేజ హీరోగా నటించిన ధమాకా సినిమాలో హీరోయిన్ గా చేసింది. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. కానీ ఆ తర్వాత శ్రీలీల చేసిన సినిమాలేవీ బాక్సాఫీస్ దగ్గర విజయాన్ని సాధించలేకపోయాయి. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్ లు అందుకున్నప్పటికీ ఈ అమ్మడి అనుకున్నంత సక్సెస్ మాత్రం రాలేదు. భగవంత్ కేసరి సినిమా హిట్ అయినప్పటికీ ఆ హిట్ బాలయ్య ఖాతాలోకి వెళ్ళిపోయింది. మహేష్ బాబు గుంటూరు కారం సినిమాలో నటించినా కూడా ఆ సినిమా కూడా నిరాశపరిచింది. చివరగా నితిన్ తో రాబిన్ హుడ్ సినిమా చేసింది. కానీ ఈ సినిమా కూడా నిరాశపరిచింది.



వేగుచుక్క

# యాప్‌లో దంపతుల పోర్నోగ్రఫీ వీడియోలు.

## నగరం నడిబొడ్డున గలీజు దందా

- ఇంటి డాబాపై ప్రత్యేక సెటప్.' గుర్తించి, నోటీసులు ఇచ్చిన పోలీసులు

**హైదరాబాద్, జూన్ 26 :**

పోర్న్ వీడియోలను చూసి, ఆ తర్వాత ఓ యాప్లో చేరిన దంపతులు డబ్బుకోసం తామే పోర్నోగ్రఫీని లైవ్లో చేయడం మొదలు పెట్టారు. దీనికోసం ఇంటి డాబాపై పరదాలతో ప్రత్యేకంగా సెటప్ చేసుకున్నారు. వీక్షకులను ఆకట్టుకుంటూ.. వీడియోలు చేసేవారు.! ఆనోటా ఈనోటా విషయం తెలిసిన హైదరాబాద్ తూర్పు మండలం టాస్క్ ఫోర్స్ పోలీసులు రంగంలోకి దిగి, వారి ఆట కట్టించారు. అంబర్ పేట పోలీసుల కథనం ప్రకారం.. పేట్ అంబర్ పేట్ మల్లికార్జున నగర్ లో ఉండే వ్యక్తి(42) ఇంటర్ వరకు చదివి.. డ్రైవర్గా పనిచేస్తున్నాడు. ఆయన భార్య(37) ఐదో తరగతి వరకు చదువుకున్న గృహిణి. వీరికి ఇంజనీరింగ్, ఇంటర్ చదివే ఇద్దరు కుమార్తెలున్నారు. తొలుత అశ్లీల వెబ్సైట్లు, యాప్ లలో పోర్నోగ్రఫీ చూడడానికి అలవాటు పడ్డ ఈ దంపతులు... క్రమంగా సులభంగా డబ్బు సంపాదించేందుకు పోర్నోగ్రఫీ యాప్లో సభ్యులుగా చేరి, తమ అశ్లీల వీడియోలు అప్లోడ్ చేసేవారు. ఒక్కో వీడియోకు రూ.500 మొదలు. రూ.2 వేలు వచ్చేవి. దాంతో.. లైవ్ టెలికాస్ట్తో పోర్నోగ్రఫీకి ఎక్కువ డబ్బులొస్తాయని తెలుసుకొని, తమ డాబాపై పరదాలతో ప్రత్యేకంగా సెటప్ ఏర్పాటు చేశారు. "పోర్నోగ్రఫీ యాప్లో వీక్షకులు కోరినట్లు ఈ దంపతులు ప్రవర్తిస్తారు. ఆశ్లీలం హద్దు మీరాలంటే.. వీక్షకులు వీరికి క్రెడిట్స్ ఇవ్వాలి. ఆ క్రెడిట్స్ ను వీరు డబ్బుగా మార్చుకుంటారు" అని ఈ కేసు విచారణలో పాలుపంచుకుంటున్న ఓ అధికారి వివరించారు. తెలుగు కస్టమర్లు పెరుగుతుండడంతో 'లైవ్ సెక్స్' కథ తూర్పు మండలం టాస్క్ ఫోర్స్ పోలీసులకు చేరింది. దాంతో వారు కొంతకాలంగా ఈ దంపతులపై నిఘా పెట్టారు. బుధవారం అదుపులోకి తీసుకొన్న అంబర్ పేట్ పోలీసులు వారిని విచారించి, ఎప్పుడు పిలిస్తే అప్పుడు విచారణకు రావాలంటూ నోటీసులు ఇచ్చి పంపారు.

# ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో కొత్త లేపాక్షి షోరూమ్‌లు!

విజయవాడ:రాష్ట్రం లోపల, వెలుపల కొత్త షోరూమ్‌ల ఏర్పాటుతో వ్యాపారాన్ని విస్తరించడంతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రాల్లోనూ కొత్త లేపాక్షి షోరూమ్‌ల ఏర్పాటుపై దృష్టిసారిస్తున్నట్లు ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ లిమిటెడ్ (లేపాక్షి) ఛైర్మన్ డా. పసుపులేటి హరిప్రసాద్ అన్నారు.విజయవాడ గాంధీనగర్ లేపాక్షి బిల్డింగ్‌లో ఏపీహెచ్‌డీసీ లిమిటెడ్ 182వ డైరెక్టర్ల బోర్డు సమావేశం జరిగింది. డా. పసుపులేటి హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో హస్తకళా ఉత్పత్తులకు పెద్దఎత్తున ప్రచారం కల్పించడంతో పాటు వన్ డిస్ట్రిక్ట్ - వన్ ప్రొడక్ట్ (ఓడీఓపీ)లను ప్రోత్సహించడంపై కీలక చర్చ జరిగినట్లు లేపాక్షి వీసీ, ఎండీ ఎం.విశ్వ తెలిపారు. లేపాక్షి షోరూమ్‌ల ద్వారా అమ్మకాలను ఎప్పటికప్పుడు విశ్లేషించుకొని, హస్తకళాప్రియులకు నాణ్యమైన సేవలు అందిస్తూ కార్పొరేషన్ లాభాల బాటల్లో పయనించేలా వినూత్న కార్యాచరణ చేపట్టడంపైనా చర్చ జరిగినట్లు వెల్లడించారు. సోషల్ మీడియా ద్వారా లేపాక్షి బ్రాండ్‌కు విస్తృత ప్రచారం నిర్వహించడం, హోర్డింగ్‌ల ఏర్పాటు వంటి అంశాలపైనా చర్చించడం జరిగిందని.. రాష్ట్ర ప్రభుత్వ దార్శనికతకు అనుగుణంగా అందరి సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని సమష్టి కృషితో లేపాక్షిని ఉన్నతంగా నిలిపేందుకు కృషిచేయడం జరుగుతుందని విశ్వ పేర్కొన్నారు.

# బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టండి..

**చట్టాలను సమర్థవంతంగా అమలు చేయండి..**

**బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దండి..**

**బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి బాల్యానికి భరోసా కల్పిద్దాం..**

**జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ**



విజయవాడ:బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెట్టి బాలకార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులను ఆదేశించారు.బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై గురువారం జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధ్యక్షతన ఆయన కార్యాలయంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమిటీ అధ్యక్షులు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు రూపొందించిన చట్టాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 18 సంవత్సరాలలోపు బాలలతో పనిచేయించే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని, గుర్తించిన బాలలను బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేక బృందాల దాడులతో బాల కార్మిక వ్యవస్థ నుంచి విముక్తి పొందిన చిన్నారులకు మంచి భవిష్యత్తును కల్పించేందుకు విద్యావకాశాలు కల్పించాలని, అదే విధంగా నైపుణ్య కోర్సుల ద్వారా మంచి కెరీర్‌ను అందించేందుకు సమన్వయ శాఖల అధికారులు కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. టాస్క్‌ఫోర్స్ బృందాలు దాడులను ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. దాడులలో గుర్తించిన బాల కార్మికులకు వృత్తి విద్యాకోర్సులు, వొకేషనల్ కోర్సులలో చేర్పించి వారికి ఆసరా కల్పించాలన్నారు. పి4లో వారి తల్లిదండ్రుల బంగారు కుటుంబాలకు యజమానులు ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాసవి మహిళా మండలి స్వచ్ఛంద సంస్థలో నైపుణ్య శిక్షణ, వొకేషనల్ ఇంటర్‌మీడియట్ కోర్సులలో ఉచిత విద్యను అందించి శిక్షణ అందించాలని సూచించారు. ఈనెల 31వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఫ్యాన్ ఇండియా చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించిన 13 మంది అడల్ట్స్ అండ్ లేబర్‌కు కనీస వేతనాలు చెల్లింపుతో పాటు బాలకార్మిక వ్యతిరేక చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలలు మరియు కౌమారదశ కార్మిక (నిషేధం మరియు నియంత్రణ) 1986 చట్టాన్ని పటిష్టంగా జిల్లాలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, మహిళా శిశు సంక్షేమం, రెవెన్యూ, చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థల సభ్యుల కమిటీ బాలకార్మికులను గుర్తించాలన్నారు. కౌమార దశలో గుర్తించిన బాలకార్మికులకు ఆసక్తి గల చేతి వృత్తిలో శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటే భవిష్యత్‌లో జీవనోపాది కల్పించినవారవుతామన్నారు. బాల కార్మిక చట్టాలపై ప్రజలలో పూర్తి స్థాయిలో అవగాహన కల్పించిననాడే బాల కార్మిక వ్యవస్థను సమూలంగా రూపు మాపగలుగుతామన్నారు. అధికారులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజలను చైతన్యవంతులను చేసి జిల్లాను బాల కార్మిక రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం లక్ష్మీ నరసింహం, డిప్యూటి కమీషనర్ ఆఫ్ లేబర్ సిహెచ్ ఆషారాణి, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టర్స్ డి. రామచంద్రరావు, డిప్యూటి డియంఅండ్ హెచ్‌వో డా. జె. ఇందుమతి, సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేట్ జి. మహేశ్వరరావు, వాసవ్య మహిళ మండలి అధ్యక్షురాలు డా. బి. కీర్తి, ఫారం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో-ఆర్డినేటర్ అరవరమేష్, దిశ స్టేషన్‌ఆఫీసర్ కె. వాసవి, కమిటీ సభ్యులు ఉన్నారు.

# పాన్ మసాలా ప్రకటనలు నిషేధించాలి

**స్టార్ హీరోలు ప్రకటనలకు దూరంగా ఉండాలి**

**సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ**



గుంటూరు: పాన్ మసాలా ప్రకటనలను ఎందుకు నిషేధించరని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ప్రశ్నించారు. ఈ ప్రకటనల్లో స్టార్ హీరోలు పాల్గొనడం దారుణమని అన్నారు.
పాన్ మసాలా కొనమని స్టార్ హీరోలు, హీరోయిన్స్ ప్రచారం కల్పించడం బాధాకరమన్న ఆయన.. పాన్ మసాలా తయారీ కేంద్రాలను గుర్తించి సీజ్ చేయాలని సూచించారు.. గుంటూరులో ఆయన మాట్లాడుతూ.. సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు మాదకద్రవ్యాల నియంత్రణ కోసం కార్యక్రమం నిర్వహించడం అభినందనీయం అన్నారు.. రాష్ట్రంలో గంజాయి సాగును గుర్తించి వాటి మూలాలను నిర్మూలించాలన్నారు.. పాన్ మసాలాతోపాటు 10 రూపాయలు అదనంగా ఇస్తే కిందనుండి మరో చిన్న ప్యాకెట్ తీసి బై వన్ గెట్ వన్ లాగా ఇస్తున్నారు. చిన్న ప్యాకెట్లు వలన చాలా ప్రమాదం ఉంది. క్యాన్సర్ బారిన పడే ప్రమాదం లేకపోలేదని హెచ్చరించారు.. కేంద్రం చంద్రబాబు చేతుల్లో ఉంది కాబట్టి గుట్కా, పాన్ మసాలా తయారీ, ఉత్పత్తి కేంద్రాలను కట్టడి చేయాలని సూచించారు సీపీఐ నారాయణ.. చిన్న చిన్న షాపులను, వ్యక్తులను పట్టుకుంటూ వీధిలో నాటకాలు వేస్తే ఉపయోగం ఉండదన్నారు.. ఇక, గతంలో అమరావతి రాజధాని కోసం 30 వేల ఎకరాలను తీసుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పరిపాలనలో అమరావతి రాజధాని అభివృద్ధి కుంటుపడింది.. మరల చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత అమరావతి రాజధానికి పునర్జన్మ వచ్చిందన్నారు.. కేంద్ర ప్రభుత్వం సహకారంతో చంద్రబాబు ఏడాదిగా పరిపాలన చేస్తున్నారు.. అమరావతి రాజధాని నిర్మాణం కోసం మరో 40 వేల ఎకరాలు కావాలని చంద్రబాబు మాట్లాడడం బాధాకరం.. రైతులు మరలా భూములు ఇచ్చేందుకు ఆసక్తిగా లేరన్నారు.. గతంలో ఇచ్చిన భూములకు సంబంధించి నిర్మాణాలు చేపట్టి, డెవలప్మెంట్ చూపిస్తే రైతులు ఆసక్తిగా మరో 40 వేల ఎకరాలు ఇచ్చేందుకు ముందుకు వస్తారని పేర్కొన్నారు.. పంటలు పండే భూములను ఈ విధంగా చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థలో ఆహార సమస్యలు వస్తాయి.. సూపర్ సిక్స్ హామీలలో తల్లికి వందనం ఒక్క పథకం అమలు చేశారు.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా అలివి కానీ హామీలు ఇచ్చారన్నారు.. గత ఐదేళ్లలో వైసీపీ చేసిన విధ్వంసం నుండి కోలుకోవడానికి సమయం పడుతుంది.. కూటమి ఏడాది పాలనలోనే అన్ని చేయమని మేము అడగడం లేదు.. అమరావతి రాజధానిలో విమానాశ్రయం రావాలన్నారు నారాయణ..
గన్నవరం విమానాశ్రయం చాలా చిన్నది ఇప్పటికే సరిపోవడం లేదు.. చంద్రబాబు చేస్తున్న హడావుడికి అమరావతి
రాజధాని ప్రాంత ప్రజలకు నమ్మకం కలగడం లేదు.. పోలవరం ప్రాజెక్టు అంచనాలను మార్చేశారు. జగన్ తప్పిదాలు వలనే పోలవరం ప్రాజెక్టు అంచనాలు మారాయని చెప్తున్నారు.. జగన్
తప్పులు చేశారు కాబట్టే ప్రజలు 11 సీట్లు ఇచ్చారన్నారు. ఇక, సముద్రంలోకి వెళ్లే నీటిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు సమన్వయంగా వాడుకోవాలని సూచించారు.. బీజేపీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంది.. 2029లోగా కులగనన జనగణన జరిగి తీరాలన్నారు.. త్వరలో జరిగే సీపీఐ జాతీయ మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్తు ఆందోళన కార్యచరణ రూపొందిస్తాం అన్నారు.

# ఆదివాసీల హక్కులు బాధ్యత మంత్రి సీతక్కదే

**అణచివేత నుంచి వారిని కాపాడాలి**

**మావోయిస్ట్ అధికార ప్రతినిధి జగన్ ప్రకటన**



ములుగు: ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణకు పూర్తి బాధ్యత మంత్రి సీతక్క వహించాలని మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ గురువారం ఒక లేఖలో పేర్కొన్నారు. ములుగు జిల్లాలోని ఆదివాసీ ప్రాంతాల్లో ఫారెస్టు అధికారులు, పోలీసులు ఆదివాసీలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తరతరాలుగా పోడు వ్యవసాయం చేసుకుంటున్న ప్రజలను అరెస్టులు, కేసుల బెదిరింపులతో గూడేలను ఖాళీ చేయించడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. ఆదివాసీ బిడ్డ, మాజీ నక్సలైట్‌గా ప్రాచుర్యంలో ఉన్న సీతక్క సొంత నియోజకవర్గంలో ఈ విధంగా జరగడం సిగ్గుచేటు, అవమానకరమని అన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో కీలక మంత్రిగా ఉన్న ధనసరి అనసూయ ఎందుకు ఆదివాసీల గురించి మాట్లాడడం లేదనేది అందరూ మాట్లాడుకుంటున్నారని తెలిపారు. భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్‌పై, 1996లో కాంగ్రెస్ పార్టీ తెచ్చిన పీసా చట్టంపై, 2006లో కాంగ్రెస్ పార్టీ తెచ్చిన ఎఫ్ఆర్ఏ, 1/70 చట్టాన్ని సీతక్క మరచిపోయిందా.. అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ ఆదివాసీలు, భారత రాజ్యాంగం గురించి పదే పదే మాట్లాడుతున్నది రాష్ట్ర కాంగ్రెస్ నాయకులకు అర్థం కావడం లేదా అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ఆదివాసీ ప్రజల హక్కుల పరిరక్షణకు పూర్తి బాధ్యత సీతక్క వహించాలని మావోయిస్టు పార్టీ డిమాండ్ చేస్తుందని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, బుద్ధిజీవులు కొన్ని వేల సంవత్సరాలుగా ఈ దేశ సందపను కాపాడుతున్న ఈ దేశ మూలవాసులైన ఆదివాసీలను కాపాడుకోవడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఆదివాసీలు అడుగుతున్నది భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం గ్రామసభలు, నిర్ణయాధికారంతో అభివృద్ధిని కోరుకుంటున్నారని, అందరూ వారి హక్కుల అమలు కోసం అండగా ఉండాలని జగన్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

# మరోమూడేళ్లు సిఎం రేవంత్ రెడ్డే

**ఆ తరవాత ఛాన్స్ కోసం నేను ప్రయత్నిస్తా**

**టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**



**హైదరాబాద్:** మరోమూడేళ్లు రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ సీఎం పదవిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వచ్చే ఐదేళ్లు మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత సీఎం కావడానికి తాను ప్రయత్నం చేస్తానని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా దిగిపోయాక తాను ముఖ్యమంత్రిని కావడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. ఆ క్రమంలో తన అప్లికేషన్ ప్రజల దగ్గర పెడుతానని చెప్పుకొచ్చారు. గురువారం గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇకపోతే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకి జగ్గారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కవిత ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. కవిత బీఆర్ఎస్‌లో ఉంటే ఏంటి.. బయటకు వస్తే ఏంటని ప్రశ్నించారు. ఆమె మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తండ్రి వారసత్వం కొడుకుకే ఉంటుందని.. ఒకవేళ కొడుకు లేకపోతే కూతురికి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. తాము స్పందించే అంతటి లీడర్ కవిత కాదనే తమ అభిప్రాయమని జగ్గారెడ్డి అన్నారు. కవిత పెద్ద పెద్ద మాటలు ఎందుకు మాట్లాడుతుందో అర్థం కావడం లేదని చెప్పారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి సమానమైన ప్రాధాన్యం ఉన్న నేతలని చెప్పుకొచ్చారు. రాజకీయంగా ఒకరిని మరొకరు విమర్శించుకుంటే అర్థముందని అన్నారు. కవిత ఎందుకు అనవసరంగా తమ గురించి మాట్లాడుతోందని ప్రశ్నించారు. హాయిగా బతుకమ్మ ఆడుకోకుండా కవితకి ఎందుకు ఈ పంచాయితీ అని నిలదీశారు. లిక్కర్ స్కాంలో పైసలు పెట్టడానికి కవితకి ఇన్ని వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని జగ్గారెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.

# తేజేశ్వర్ హత్యలో సంచలన విషయాలు



గద్వాల:భార్య కామదాహానికి బలైన తేజేశ్వర్ హత్య కేసులో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి. తేజేశ్వర్ కదలికల కోసం బైకుకు జిపిఎస్ అమర్చినట్లుగా గుర్తించారు. వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనే ప్రైవేట్ సర్వేయర్ తేజేశ్వర్‌ను ఆయన భార్య ఐశ్వర్య హత్య చేయించినట్లు జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం గద్వాలలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేసుకు సంబంధించిన కీలక విషయా లను ఆయన వెల్లడించారు. వివాహమైన నెలకే ప్రియుడు, బ్యాంక్ మేనేజర్ తిరుమల్‌రావుతో కలిసి ఐశ్వర్య కుట్ర చేసినట్లు తెలిపారు. సుపారీ గ్యాంగ్ సాయంతో భర్తను చంపించినట్లు వివరించారు. 'ఈనెల 17న తేజేశ్వర్ అదృశ్యమయ్యాడు. ఈనెల 21న గాలేరు- నగరి కాల్వలో ఆయన మృతదేహం లభ్యమైంది. గతేడాది డిసెంబర్‌లో ఐశ్వర్య-తేజేశ్వర్‌కు నిశ్చితార్థం జరిగింది. అప్పటి నుంచే తేజేశ్వర్‌ను హతమార్చేందుకు తిరుమల్‌రావు, ఐశ్వర్య కుట్ర చేశారు. ఈ హత్యకు తిరుమల్‌రావు సుపారీ ఇచ్చారు. బ్యాంకులో రుణం కోసం తన వద్దకు వచ్చిన నగేశ్‌తో ఒప్పందం చేసుకున్నాడు. తేజేశ్వర్ కదలికలు తెలుసుకునేందుకు అతడి బైక్‌కు జీపీఎస్ అమర్చారు. పొలం గురించి మాట్లాడదామని నిందితులు తేజేశ్వర్‌ను కారులో తీసుకెళ్లి వేటకొడవళ్లతో హతమార్చారు. మృతదేహాన్ని గాలేరు-నగరి కాలువలో పడేశారు. నిందితులు ఇటీవల మేఘాలయలో జరిగిన హనీమూన్ మర్డర్ కేసు గురించి చర్చించుకున్నారు. ఆ తరహాలో దొరక్కూడదని మాట్లాడుకున్నారు. ఐశ్వర్యను రెండో పెళ్లి చేసుకోవాలని తిరుమల్‌రావు ప్రణాళిక రచించాడు. హత్య తర్వాత తిరుమల్‌రావు, ఐశ్వర్య లద్దాఖ్ వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఐశ్వర్య తల్లితో తిరుమల్‌రావుకు వివాహేతర సంబంధం ఉంది.

**కదలికలు కనిపెట్టేందుకు బైకుకు జిపిఎస్ అమరిక**

**వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నడానే హత్య**

**వివరాలు వెల్లడించిన గద్వాల ఎస్పీ**

# తెలంగాణ ఉద్యోగులలకు శుభవార్త

**రూ.180.38 కోట్ల మెడికల్ రియంబర్స్‌మెంట్ విడుదల**

**దాదాపు 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట**

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు భారీ ఊరట లభించింది. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌గా ఉన్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులను ప్రస్తుత ప్రభుత్వం క్లియర్ చేసింది. మొత్తంగా రూ.180.38 కోట్ల బిల్లులు విడుదల చేయడం ద్వారా దాదాపు 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఊపిరి పీల్చుకునే అవకాశం లభించింది. డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు. ప్రభుత్వంపై భారీ ఆర్థిక భారం ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాల అమలు కొనసాగుతుండగానే, ఉద్యోగుల ఆరోగ్య ఖర్చులకు సంబంధించిన బిల్లులను ప్రాధాన్యతతో పరిష్కరించారు. 2023 మార్చి 4 నుండి 2025 జూన్ 20 వరకు పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను సమగ్రంగా పరిశీలించి ఈ మొత్తాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాలు, పింఛన్ హక్కుదారులు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అభినందించాయి. ప్రభుత్వ నిబద్ధతను ఈ చర్య ప్రతిబింబించిందని పేర్కొన్నారు. గతంలో ప్రభుత్వం మారిన సందర్భాల్లో ఈ విధంగా వెంటనే స్పందించిన ఉదాహరణలు తక్కువగా ఉన్నాయని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ వైఖరితో నష్టపోయిన వర్గాలకు న్యాయం జరుగుతుందని, భవిష్యత్తులో మరిన్ని సానుకూల చర్యలు కూడా ఆశించదగిన వాతావరణం ఏర్పడిందని ఉద్యోగులు, పింఛనర్లు తెలిపారు. బోనాలు పండగ ప్రారంభమైన వేళ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. పెండింగ్‌లో ఉన్న రూ.180.30 కోట్ల మేర మెడికల్ బకాయిలను క్లియర్ చేసినట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. దీంతో 26,519 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఊరట
లభించనుందని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వంలోని పెండింగ్ బిల్లులనూ క్లియర్ చేసినట్లు ఉపముఖ్యమంత్రి తెలిపారు. తెలంగాణలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ భారీఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని డిప్యూటీ సీఎం వివరించారు. అదే విధంగా ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులకూ ప్రాధాన్యత ఇస్తూ ఈ బకాయి నిధులు విడుదల చేసినట్లు భట్టి విక్రమార్క సోదాహరణగా విపులీకరించారు.

# రాష్ట్రంలో హార్బర్లు, పోర్ట్‌ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో హార్బర్లు, పోర్ట్‌ల నిర్మాణంపై తమ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఏడాది కాలంలో వీటిని పూర్తి చేసి ప్రారంభించే విధంగా పనులు చేపడుతున్నామని తెలిపారు. ఫేజ్ టూ కింద మరో నాలుగు ఫిషింగ్ హార్బర్లలో కూడా నిర్మాణ పనులు చేపడతామని వివరించారు. 950 కిలోమీటర్ల తీర ప్రాంతంలో ప్రతి 50 కిలోమీటర్లకు షిప్పింగ్ బోట్లు ఏర్పాటు చేశామని వెల్లడించారు. గురువారం ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ అథారిటీ ఆధ్వర్యంలో స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య, ఏపీ ఇన్ ల్యాండ్ వాటర్ వేస్ అథారిటీ ఛైర్మన్ జెడ్. శివప్రసాద్, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ కార్యదర్శి యువరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడారు. భోగాపురం విమానాశ్రయం పనులు 78శాతం పూర్తయ్యాయని.. ఈ ఏడాదిలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రకటించారు. రూ.595 కోట్లతో విజయవాడ విమానాశ్రయాన్ని కూడా అన్ని స్థాయిలో అభివృద్ధి చేస్తామని అన్నారు. త్వరలోనే నూతన నిర్మాణాలను, నూతన భవనాలను ప్రారంభిస్తామని వెల్లడించారు. విజయవాడ, కడప, తిరుపతి, కుప్పం విమానాశ్రయాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని చెప్పారు. భూసేకరణ ఇతర సమస్యలను పూర్తిగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌లను ఆదేశించామని అన్నారు. అమరావతిలో అతిపెద్ద విమానాశ్రయం నిర్మాణానికి అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. మూడేళ్లలో ఈ నిర్మాణాన్ని పూర్తి చేయాలని భావిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సాయంతో ఏపీ ÷బైర్ నెట్‌ని పూర్తిగా పునరుద్ధరిస్తామని
చెప్పారు. గత జగన్ ప్రభుత్వంలో నిర్లక్ష్యం చేసిన ప్రాజెక్ట్‌లను ఈ ప్రభుత్వంలో పూర్తి చేస్తామని స్పష్టం మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి చేశారు.